# నమస్తే తెలంగాణ

# మహబూబ్‌నగర్

## నారాయణపేట

5 | మహబూబ్‌నగర్, ఆదివారం 10 నవంబర్ 2024 | MAHABUBNAGAR NARAYANPET


### పంట కోసి 20 రోజులైంది..



సర్కారు వడ్లు కొంటుందని 20 రోజుల నుంచి ఎదురు చూస్తున్నా. 8 ఎకరాల్లో వరి సాగుచేసినం. నాలుగున్నర ఎకరాలు కోసి ఆరబెట్టినం. సర్కారోళ్లు కొంటామని చెప్పడమే తప్పా కొనింది లేదు. మిగిలిన చేను కూడా కోయాల్సి ఉన్నది. ఇన్ని రోజులుగా కొనకుండా రైతులను ఇబ్బందులు పెడితే ఎట్లా. వానొస్తే మాకు ఎంత కష్టం, నష్టం వస్తుంది.

- మహేశ్వరి, రైతు, రామన్‌పాడ్, మదనాపురం మండలం

### పదేండ్లలో ఎప్పుడూ ఇంత డీలా కాలే..



పది రోజుల నుంచి తుకాలు చేస్తామని చెబుతున్నరు. మాకున్న 11 ఎకరాలు నాటుకోగా, 7 ఎకరాలు కోసి అమ్మకానికి సిద్ధంగా ఉంచినం. సర్కారు అప్పుడు, ఇప్పుడు అనడమే కానీ తూకం చేయడం లేదు. పదేండ్లు దనాధన్.. ఫటాఫట్ అనేలా ఇబ్బంది లేకుండా అమ్ముకున్నాం. ఇప్పుడేమో కొనడానికే డీలా చేస్తున్నరు. చాలా మంది ప్రైవేటోళ్లకు అమ్ముకొని నష్టపోయిండ్రు.

- శంకరమ్మ, రామన్‌పాడ్



మదనాపురం మండలం కొత్తపేటలో సన్న వడ్లను తూకం చేస్తున్న ప్రైవేట్ వ్యాపారి

- మదనాపురం మండలం రామన్‌పాడ్‌లో దాదాపు వెయ్యి ఎకరాల్లో వరి సాగైంది. 150 ఎకరాల్లో కోతలు ముగిశాయి. అక్టోబర్ 26న ఐకేపీ, సింగిల్ విండో పరిధిలో రెండు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే జీఎంఆర్ ప్రారంభించారు. ఇప్పటికీ 15 రోజులైనా కేంద్రాలకు స్టాంపులు చేరనందున ఒక్క గింజనూ కొనలేదు.
- వీపనగండ్ల మండల కేంద్రంలో 2,300 ఎకరాల్లో వరి సాగైంది. ఇక్కడ రెండు ఐకేపీ సెంటర్లను గుర్తించారు. వీటికి ఇప్పటి వరకు సంచులు రాలేదు, స్టాంపులు అందలే. వరి కోతలు 20 శాతం అయినవి. కొనుగోళ్లు మాత్రం షురూ కాలే.
- మదనాపురం మండలం కొత్తపేటలో 700 ఎకరాల్లో వరి సాగైంది. వీటిలో 80 శాతం వరకు కోతలయ్యాయి. కండ్లు కాయలు కాసేలా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు ఎదురుచూశారు. ఇప్పటికే దాదాపు 1,500 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకున్నారు.

- ధాన్యం కొనుగోలు సెంటర్ల జాడేదీ?
- కనీస సౌకర్యాలు కరువు
- కేంద్రాల్లోనే అమ్మాలంటున్న నిర్వాహకులు
- తేమ శాతం పేరిట కొర్రీలు
- నేటికీ ఒక్క గింజనూ కొనుగోలు చేయని వైనం
- నాడు హడావుడిగా ప్రారంభించి.. ఫొటోలకు ప్రజాప్రతినిధుల ఫోజులు
- నేడు కొనడంలో అధికారుల నిర్లక్ష్యం
- ప్రైవేట్‌ను ఆశ్రయిస్తున్న రైతులు
- బోనస్ ఊసెత్తక పోవడంతో కర్షకులు లేక కేంద్రాలు వెలవెల



నారాయణపేట జిల్లా మాగనూరు మండలం గుడెబల్లూర్ కేంద్రంలో ధాన్యం కొనుగోళ్లను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తున్న రైతులు

# కానరాని కేంద్రాలు



బోసిపోయిన ధన్వాడ కొనుగోలు కేంద్రం

### బోనస్ ఇస్తుందన్న నమ్మకం లేదు..



కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీయే సక్కగా చేయలేదు. రెండు విడుతలుగా రైతు భరోసా లేదు. ఇక వీళ్లు మద్దతు ధర ఇచ్చి బోనస్ ఇస్తారంటే నమ్మకమెట్లా వస్తది. అందువల్లే చాలామంది ధాన్యాన్ని ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకుంటున్నరు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకెళ్లడానికి రవాణా ఖర్చులు, గన్నీ బాగులు కొనాలంటే బోలెడంత ఖర్చవుతుంది.

- రాములుగౌడ్, రైతు, పాతపల్లి, ధన్వాడ మండలం, నారాయణపేట జిల్లా

### రెండ్రోజుల్లో ప్రారంభిస్తాం..

రెండ్రోజుల్లో ధాన్యం కొనుగోళ్లను ప్రారంభిస్తాం. పూర్తిస్థాయిలో సెంటర్లకు సామగ్రి అందలేదు. ఇటీవలే డీఎంగా బాధ్యతలు తీసుకున్నా. త్వరలోనే తూకాల జరిపిస్తాం. ఇందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. ఎలాంటి ఇబ్బందుల్లేవు. కొత్త విధానం అమల్లోకి వచ్చినందున ఆలస్యమవుతున్నది.

- రమేశ్, జిల్లా పౌరసరఫరాల శాఖ డీఎం, వనపర్తి

మహబూబ్‌నగర్, నవంబర్ 9 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు అలంకారప్రాయాలుగా మారాయి. ధాన్యం కొనుగోలు చేయడమే కాకుండా సన్న వడ్లకు బోనస్ ఇస్తామని సర్కారు ప్రకటించినా కొనుగోళ్లు లేక వెలవెలబోతున్నాయి. ప్రభుత్వ నిబంధనల వల్ల ఎక్కడ కూడా ధాన్యం కొనుగోలు ప్రారంభం కాలేదని తెలుస్తోంది. రైతులు ఇక చేసేది లేక దళారులకు ధాన్యాన్ని అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొన్నది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వమే రైతుల కల్లాల వద్దకు వెళ్లి తూకం చేసి వడ్లను కొని లారీల్లో మిల్లర్లకు పంపించేది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రైతులే కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకురావాలని షరతు విధించింది. అంతేకాకుండా ఒక్క గన్నీ బ్యాగ్ కూడా ఇప్పటివరకు సరఫరా చేయలేదు. పైగా ధాన్యాన్ని బాగా ఆరబెట్టి తీసుకొస్తేనే కొంటామని మెలిక పెట్టింది. ఫలితంగా రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ధాన్యాన్ని ఆరబెట్టడం, సొంత బ్యాగులను నింపడం, తర్వాత కేంద్రాలకు తీసుకొచ్చి అమ్ముకోవడం ఖర్చుతో కూడుకున్న పనిగా భావిస్తున్నారు. తేమ శాతం, ఇతర నిబంధనల వల్ల రైతులు హడలిపోతున్నారు. దీంతో అమ్మకాలు లేక కొనుగోలు కేంద్రాలన్నీ వెలవెలబోతున్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లాలో కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యాన్ని ఆరబెట్టి అమ్ముకుందామంటే కొనే పరిస్థితి లేదు. మరోవైపు సర్కార్ సన్నవడ్లకు మద్దతు ధరతో పాటు రూ.500ల బోనస్ ఇస్తామని ప్రకటించింది. ఈ బోనస్‌పై ఇంతవరకు విధివిధానాలు లేక పోవడంతో ఏం చేయాలో తోచక అధికారులు రైతులకు ఏం చెప్పాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. సర్కారు చెప్పేదానికి వాస్తవ పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉంది. మరోవైపు రైస్ మిల్లర్లు సర్కారు మద్దతు ధర కన్నా రూ.80 క్వింటాకు అధికంగా ఇచ్చి నేరుగా కొంటున్నారు. దీంతో చాలామంది రైతులు గత్యంతరం లేక ప్రైవేట్‌కు అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొన్నది.

**ఒక్క గింజనూ కొనలేదు..**

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా ఇప్పటి వరకు ఒక్క గింజ కూడా కొనలేదు. మంత్రి, ఎమ్మెల్యేలు ఫొటోలకు ఫోజులిస్తూ ఆగమేఘాలపై కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మద్దతు ధరతో పాటుసన్న వడ్లకు బోనస్ కూడా ఇస్తామని పదేపదే చెబుతున్నారు. వాస్తవ పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉంది. నిబంధనల వల్ల చాలా మంది రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకురావడానికి ఆసక్తి చూపడం లేదు. అంతేకాకుండా రవాణా చార్జీలు, గన్నీ బ్యాగుల ఖర్చు అదనంగా భరించాల్సి వస్తున్నది. గతంలో నేరుగా కల్లాల వద్దకే లారీలు వచ్చి కొనుగోలు చేస్తే బాగుంటుందని రైతులు అభిప్రాయపడుతున్నారు.

**మిల్లర్లు, సర్కారు మిలాఖత్..**

సర్కారు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ కొనుగోలు చేయక పోవడం వెనక మతలబు ఏమిటని రైతాంగం ప్రశ్నిస్తున్నది. అదే రైస్ మిల్లర్లు మాత్రం ధాన్యాన్ని సర్కారు మద్దతు ధరకు అదనంగా క్వింటాకు రూ.100 వరకు ఎక్కువ ఇచ్చి కొంటున్నారు. దీంతో సర్కారు మిల్లర్లతో మిలాఖత్ అయ్యి కొనుగోళ్లను నిర్లక్ష్యం చేస్తున్నదని ఆరోపిస్తున్నారు. తేమ శాతాన్ని మిల్లర్లు అంతగా పట్టించుకోకపోవడంతో ఉమ్మడి జిల్లాలో చాలామంది నేరుగా వ్యవసాయ మార్కెట్లకు చేరుకొని కమిషన్ ఏజెంట్లకు క్వింటాకు రూ.2010 చొప్పున అమ్ముకుంటున్నారు.

**బోగస్‌గా మారిన బోనస్..**

ధాన్యానికి మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ ఇస్తామని కాంగ్రెస్ ఎన్నికలకు ముందు హామీ ఇచ్చి తర్వాత రెండు సార్లు ధాన్యం కొనుగోలు చేసినా పట్టించుకోలేదు. ఈసారి వానకాలంలో వరికి మద్దతు ధరతో పాటు బోనస్ రూ.500 ఇస్తామని ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు అట్టహాసంగా ప్రకటించారు. కానీ ఇప్పటివరకు క్లారిటీ ఇవ్వలేదు. రైతులే నేరుగా కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చి ఆరబెట్టి 17శాతంలోపు తేమ ఉంటేనే మద్దతు ధర లభిస్తుందని చెబుతున్నారు. వరి కోతల య్యాక కల్లాల నుంచి నేరుగా కొనుగోలు కేంద్రాలకు రవాణా, గన్నీ బ్యాగులు కొని సర్కారుకు అమ్ముకోవడానికి రైతులు ఆసక్తి చూపడం లేదు. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ధాన్యం ఎక్కడికక్కడ నిలిచిపోయింది. దీంతో గత్యంతరం లేక దళారులకు ధాన్యం అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.

### ఉమ్మడి జిల్లాలో పరిస్థితి ఇలా..

జోగుళాంబ గద్వాల జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాలేదు. మొత్తం 60 కొనుగోలు కేంద్రాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో 39, పీఏసీసీఎస్ 21 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. సన్న రకం వరి సాగు 34,592 హెక్టార్లు, దొడ్డు రకం 1,129 హెక్టార్లలో సాగు చేసినట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. రెండు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో 252 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు నిర్ణయించారు. ఇప్పటివరకు 116 కేంద్రాలు కొనుగోలుకు సిద్ధంగా ఉన్నాయి. ఇంకా కొనుగోలు ప్రారంభం కాలేదు. వనపర్తి జిల్లాలో 377 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 4లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం లక్ష్యంగా ఉంది. నారాయణపేట జిల్లాలో 97 కేంద్రాలను ఏర్పాటు చేసినా కొనుగోలు ప్రారంభం కాలేదు.. మహబూబ్‌నగర్ జిల్లాలో 34 కేంద్రాలు ప్రారంభించగా, ఒక్క కేంద్రంలో కూడా ధాన్యం కొనుగోలు చేపట్టలేదు.

# ఆదరణ కరువు!

- ధాన్యం కొనుగోలు కేంద్రాలకు చేరని సామగ్రి
- ఎమ్మెల్యేలతో హడావుడిగా ప్రారంభం
- కోతలు పూర్తిచేసి అమ్మకానికి రైతన్నల ఎదురుచూపు
- కొన్ని చోట్లతక్కువ ధరకే వ్యాపారులకు విక్రయం
- ప్రభుత్వ తీరుపై రైతుల్లో పెరుగుతున్న ఆగ్రహం

వనపర్తి, నవంబర్ 9 (నమస్తే తెలంగాణ) : వనపర్తి జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ అస్తవ్యస్తంగా మారింది. దసరా నుంచి జిల్లాలో వరికోతలు నడుస్తుండగా, ధాన్యం కొనుగోలు చేసే ఆనవాళ్లు కనిపించడం లేదు. అక్కడక్కడా కొన్ని సెంటర్లను ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రారంభం చేసి వెళ్లడమే తప్పా ఎలాంటి కార్యాచరణ సాగడం లేదు. దాదాపు పక్షం రోజుల కిందట ఎమ్మెల్యేలు ప్రారంభించిన కేంద్రాల్లోనూ ఒక్క వడ్ల గింజ కూడా సర్కారు కొనుగోలు చేయలేదంటే జిల్లాలో ప్రభుత్వ కొనుగోళ్ల పరిస్థితి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ప్రైవేట్ వ్యాపారులు మాత్రం ప్రభుత్వ ఉదాసీనతను సొమ్ము చేసుకుంటున్నారు. సందట్లో సడేమియా అన్నట్లు అందినకాడికి రైతులతో ధాన్యాన్ని కొనేస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 30వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని ప్రైవేట్ వ్యాపారులు కొనుగోలు చేసినట్లు అనధికార అంచనా.

**కేంద్రాలకు చేరని సామగ్రి..**

ధాన్యం కొనుగోలు కేంద్రాలకు సామగ్రి పంపిణీ సరిగా లేదు. గత నెలలోనే అంతా సిద్ధమంటూ ప్రకటించినా జిల్లాలో ఏ ఒక్క సెంటర్‌కు పూర్తిస్థాయిలో సామగ్రి సరఫరా కాలేదు. దీంతో రోజుల తరబడి ధాన్యం తూకాల కోసం రైతులు ఎదురు చూడాల్సి వస్తున్నది. విధిలేని పరిస్థితిలో తుఫాన్ల ధాటికి ప్రైవేట్‌గా రైతులు విక్రయించుకోవాల్సి వస్తున్నది. అనేక సెంటర్లకు సంచులు కూడా సరఫరా కాలేదు. కొన్ని సెంటర్లకు పనికిరాని చిరిగిన సంచులను పంపించారు. మరికొన్నింటికి స్టాంపులు రాలేదు. కొనుగోలు చేసిన ప్రతి సన్న, లావు వడ్ల సంచులపై ప్రత్యేకంగా స్టాంపులు వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో కోతలు జోరందుకున్నా.. ప్రైవేట్ వ్యాపారులు వేగంగా కొనుగోలు చేస్తున్నా సెంటర్లకు సామగ్రి చేరక పోవడంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**బోనస్ పేరుతో అసలుకే ఎసరు..**

సన్న వడ్లకు క్వింటాకు రూ.500 బోనస్ ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం అసలుకే ఎసరు పెట్టిందన్న విమర్శలను అన్నదాతలు వ్యక్తం చేస్తున్నారు. ఎవరు అడగకుండానే ప్రభుత్వమే ప్రకటించి అనేక కొత్త నిబంధనలు విధించిదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వడ్ల గింజ పొడవు, వెడల్పు, లావు సైజుల నిబంధనలతో రైతులను ఇబ్బందులకు గురిచేసే యత్నమేంటని ప్రశ్నిస్తున్నారు. పదేండ్లలో ఎప్పుడూ ఇంతలా వడ్ల తూకాలకు రైతులు ఇబ్బందులు పడిన దాఖలాలు లేవని చెబుతున్నారు. రైతులు విసుగు చెంది ప్రైవేట్‌కు అమ్ముకునేలా ప్రభుత్వమే ఇలా చేస్తుందన్న ట్లుగా ప్రచారం జరుగుతున్నది.

**అస్తవ్యస్తంగా పౌరసరఫరాల శాఖ..**

జిల్లా పౌరసరఫరాల శాఖ అస్తవ్యస్తంగా కొనసాగుతున్నది. గతంలో జరిగిన ధాన్యం కొనుగోళ్లలో ఇంతలా మిల్లర్లు కాజేయడానికి పౌరసరఫరాల శాఖనే ప్రధాన కారణం. ఇందుకు బాధ్యులుగా వ్యవరించిన అధికారులు కొందరైతే, తెరవెనక నుంచి నడిపించిన మరికొందరు అధికారులుగా ప్రచారంలో ఉన్నది. ఇదిలా ఉంటే, ప్రస్తుతం ధాన్యం కొనుగోలు ప్రక్రియ జిల్లాలో రాద్ధాంతమవుతున్నది. ఈ నేపథ్యంలోనే జిల్లా పౌరసరఫరాల శాఖ డీఎంగా ఉన్న ఇక్బాల్ వివిధ ఆరోపణలతో బుధవారం బదిలీకి గురయ్యారు. ఈయన స్థానంలో మరో అధికారి రమేశ్ బాధ్యతలు తీసుకున్నారు. కొనుగోళ్లలో జరిగిన అవినీతి స్కాంలు ఒక పక్క కొనసాగుతుండగా, ఇప్పుడు జరగాల్సిన కొనుగోళ్ల ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించడంలో కొత్త అధికారికి సవాలన్నట్లుగా ఉన్నది.

## ఇన్సూరెన్స్ చేస్తేనే..

# పంట రుణం

- మెలిక పెడుతున్న ఏపీజీవీబీ మేనేజర్
- ఇబ్బందులు పడుతున్న కోడేరు రైతులు
- వారం రోజులుగా బ్యాంక్ చుట్టూ ప్రదక్షిణలు





కోడేరు మండల కేంద్రంలోని ఏపీజీవీబీ

కోడేరు, నవంబర్ 9 : ఇన్సూరెన్స్ చేస్తేనే కొత్తగా పంటరుణాలు ఇస్తానంటూ బ్యాంక్ మేనేజర్ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు ఏపీజీవీబీ మేనేజర్ నాగమహేశ్ తీరుతో ఇక్కట్లు తప్పడం లేదని వాపోతున్నారు. కొత్తగా వ్యవసాయ రుణాలు కావాలని బ్యాంక్‌లో అధికారులను అడిగితే ఇన్సూరెన్స్ చేయాలని.. ఇరకాటంలో పెడుతున్నారన్నారు. దీని తోడు రైతు భరోసా డబ్బులు కూడా ఇదే బ్యాంక్‌లో ఉన్న ఖాతాల్లో పడితేనే మీకు కొత్తగా రుణాలు ఇస్తానంటూ మెలిక పెడుతూ వేధిస్తున్నాడని ఆరోపించారు. ఇలా రోజుల తరబడి వారం రోజులుగా బ్యాంక్ చుట్టూ తిప్పుకుంటున్నారన్నారు. ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎలాంటి షరతులు లేకుండా రుణాలు ఇవ్వాలని ఆదేశిస్తుండగా.. ఏపీజీవీబీ మేనేజర్ మాత్రం ఇన్సూరెన్స్ అంటూ.. రైతు భరోసా అంటూ.. సతాయిస్తున్నారని ఆందోళన చెందుతున్నారు. సర్కారు రైతుబీమా కింద రూ.5 లక్షల ఇన్సూరెన్స్ అమలులో ఉందని, మీ బ్యాంకులో మాకు ఇన్సూరెన్స్ అవసరం లేదని రైతులు ప్రశ్నిస్తే.. మీకు రుణం ఇవ్వను అంటూ ఖరాఖండిగా చెబుతున్నారని ఆవేదన చెందుతున్నారు. అలాగే రైతుబంధు కోసం బ్యాంక్ అకౌంట్ మార్పిడీ చేయడం కోసం వ్యవసాయశాఖ అధికారులను అడిగితే ఇప్పట్లో ఆప్షన్ రాలేదని, వచ్చిన వెంటనే మారుస్తామని చెబుతున్నారని అన్నారు. మరోవైపు బ్యాంక్ మేనేజర్ ఇన్సూరెన్స్, రైతుబంధు ఖాతాలకు లింక్ పెట్టడంతో తాము పంట రుణాలు పొందే పరిస్థితి లేకుండా పోయిందని మదనపడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు చొరవ తీసుకొని ఎలాంటి షరతుల్లేకుండా పంట రుణాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

**కొత్త రుణానికి రూ.1000 కమీషన్..**

బ్యాంక్ మేనేజర్ చెప్పిన విధంగా ఇన్సూరెన్స్ చేసిన రైతులకు పంట రుణం అందించి వారి నుంచి రూ.1000 కమీషన్ తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయమై గతంలో రైతు సంఘాల నాయకులు కొందరు బ్యాంక్ వద్దకు వెళ్లి మేనేజర్‌ను ప్రశ్నిస్తే తిరిగి సంబంధిత రైతులకు డబ్బులు వాపస్ ఇచ్చాడు. కాగా రైతులకు రుణాలు అందిస్తూ చేదోడు వాదోడుగా ఉండాల్సిన బ్యాంక్ మేనేజర్, ఇతర సిబ్బంది, రైతుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకోవడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంట రుణాలు ఇవ్వకుండా సతాయించడంతో పాటు కమీషన్లు తీసుకుంటుండడంపై బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. కాగా ఈ విషయమై బ్యాంక్ మేజనేర్ నాగమహేశ్‌ను వివరణ కోరగా ప్రతి ఒక్కరికీ పంట రుణాలు ఇస్తున్నామని, కాకపోతే కొందరు రైతులు లోన్లు రెన్యూవల్ చేయటం లేదని.. అందు కోసం ఇన్సూరెన్స్, రైతుబంధు అకౌంట్లు మా బ్యాంకుకు అనుసంధానం ఉంటే రెన్యూవల్ చేయించే అవకాశాలు ఉంటాయని చెబుతున్నట్లు వివరించారు.

### ఇన్సూరెన్స్ చేయలేదని లోన్ ఇయ్యలే..



నాకు కోడేరు రెవెన్యూ శివారులో 3.20 ఎకరాల భూమి ఉంది. కొత్తగా పంట రుణం తీసుకునేందుకు మండల కేంద్రంలోని ఏపీజీవీబీ వద్దకు వెళ్లి మేనేజర్‌కు కలిసి వ్యవసాయ రుణం కావాలని అడిగా.. భూమి పట్టా పుస్తకం.. ఆధార్‌కార్డు ఈసీ చూపించమన్నాడు. అన్ని చూపించగా మూడ్రోజుల తర్వాత రమ్మన్నాడు. మళ్లీ వెళ్లగా.. లోన్ ఇస్తానుగానీ నీవు ఇన్సూరెన్స్ చేయాలని అన్నాడు.. అదేవిధంగా రైతుబంధు డబ్బులు నా బ్యాంకు ఖాతాలో పడేలా చేసి తీసుకురా.. నీకు తప్పకుండా రుణం అందిస్తా అన్నాడు.. అయితే ప్రభుత్వం రైతుబీమా పథకం అమలు చేస్తున్నది.. అందుకే తనకు ఇన్సూరెన్స్ అవసరం లేదని చెప్పాను. అయితే నీకు లోన్ ఇవ్వడం కుదరదని చెప్పి నా కాగితాలు నాకు తిరిగి ఇచ్చి పంపాడు.

- సుధాకర్, రైతు, కోడేరు, నాగర్‌కర్నూల్ జిల్లా

వనపర్తి జిల్లా కేంద్రంలోని సదర్ వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి



### సదర్ ఉత్సవాలు అభినందనీయం

- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి టౌన్, నవంబర్ 9 : ఎంతో ప్రఖ్యాతి కలిగిన సదర్ ఉత్సవాలను వనపర్తిలో నిర్వహించడం అభినందనీయమని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో సదర్ ఉత్సవాలను సంతోష్ యాదవ్, సాయిప్రసాద్ నిర్వహించగా.. నిరంజన్‌రెడ్డి హాజరయ్యారు. అంతకు ముందు పాతకోట ఆలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో శ్రీను, మహేశ్, రమేశ్ గౌడ్, హేమంత్, కురుమూర్తి, నాగన్న పాల్గొన్నారు.

- ఇథనాల్ కంపెనీకి అనుమతినిచ్చేది లేదు
- అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తా..
- ప్రజలకు బీఆర్ఎస్ అండగా ఉంటుంది
- అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

## ప్రాణాలతో చెలగాటమా?




నిరసన వ్యక్తం చేస్తున్న రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయుడు

రాజోళి, నవంబర్ 9 : ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే ఇథనాల్ ఫ్యాక్టరీ అనుమతులపై రైతులకు అండగా బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని, పచ్చని భూములను ఎడారులుగా మార్చే ఫ్యాక్టరీ అనుమతులపై అసెంబ్లీలో నిలదీస్తానని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు అన్నారు. శనివారం మండలంలోని పెద్ద ధన్వాడలో ఇథనాల్ ఫ్యాక్టరీ వ్యతిరేక పోరాట కమిటీకి మద్దతుగా ఎమ్మెల్యే విజయుడు నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విషపూరితమైన కంపెనీలకు అనుమతులు ఇచ్చి పచ్చటి పంట పొలాలను, ప్రజల ప్రాణాలను తీయాలని చూస్తే సహించేది లేదన్నారు. అనుమతులు రద్దు చేసే వరకు రైతులకు అండగా ఉంటామని తెలిపారు. నియోజకవర్గం పక్కనే తుంగభద్ర పారుతున్నా పంటలకు నీళ్లు లేక ఇబ్బందులు పడుతున్న సమయంలో తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ చొరవతో తుమ్మిళ్ల ఎత్తిపోతల, ఆర్డీఎస్ నీటివాటాలపై కృషి చేస్తూ రెండు పంటలు పండేలా తీర్చిదిద్దిన ఘనత బీఆర్ఎస్‌కు దక్కుతుందన్నారు. ఇక్కడ ఇథనాల్ ఫ్యాక్టరీకి అనుమతులు ఇచ్చి రైతులను ముంచాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కంపెనీ వ్యర్థాలతో ప్రజల ప్రాణాలకు హాని, భూములు ఎడారులుగా మారుతాయన్నారు. ఇథనాల్ ఫ్యాక్టరీని రద్దు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి ఫ్యాక్స్ ద్వారా లేఖను రాసినట్లు తెలిపారు. కంపెనీ యజమాన్యం ప్రజలకు తెలియకుండా పనులను ప్రారంభించాలని చూస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతులు, నాయకులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ నిరసన

## రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలు దహనం

- ముఖ్యమంత్రి వ్యాఖ్యలు సరికావు : గట్టుయాదవ్



ఏఎస్పీకి ఫిర్యాదు చేసిన గట్టుయాదవ్, నేతలు



రేవంత్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వనపర్తి టౌన్, నవంబర్ 9 : పదేండ్లు రాష్ట్రాన్ని సుభిక్షంగా తీర్చిదిద్దిన వ్యక్తి చావు కోరుకునేందుకేనా ప్రజలు నీకు సీఎం పదవి కట్టబెట్టిందని బీఆర్ఎస్ వనపర్తి జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్ ప్రశ్నించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలపై శనివారం ఏఎస్పీ రామదాస్ తేజావత్‌కు ఫిర్యాదు చేశారు. యాదాద్రి నర్సింహస్వామి సన్నిధిలో మాజీ సీఎం కేసీఆర్‌పై సభ్య సమాజం తలదించుకునేలా మాట్లాడడం సిగ్గుచేటన్నారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ అధిష్టానం, అభిమానులు కూడా సమర్థించరన్నారు. పోలీసులు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ శ్రీధర్, లక్ష్మయ్య, ఉదయ్‌కుమార్, కురుమూర్తియాదవ్, వేణుగోపాల్ కృష్ణ, నాగన్న యాదవ్, తిరుమల్, శ్రీను, దానియేలు, సుబ్బు, నర్సింహ, బాబునాయక్ ఉన్నారు.

జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ యూత్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం పోలీసులు బీఆర్ఎస్ నాయకులను అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. అరెస్టైన వారిలో గిరి, హేమంత్, జోహెబ్‌హుస్సేన్, రాము, క్రాంతి, ఆదర్శ తదితరులు ఉన్నారు.



సీఐకి ఫిర్యాదు చేస్తున్న నాయకులు

### రేవంత్‌పై పీఎస్‌లో ఫిర్యాదు

జడ్చర్ల, నవంబర్ 9 : కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డిపై కేసు నమోదు చేయాలని జడ్చర్లలో బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఎం హోదాలో ఉండి నీచమైన పదజాలంతో మాట్లాడడం సిగ్గుచేటన్నారు. వెంటనే సీఎంపై చర్యలు తీసుకోవాలని సీఐ ఆదిరెడ్డికి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ జిల్లా కో-ఆర్డినేటర్ నవీన్‌చంద్రారెడ్డి, నియోజకవర్గ అధ్యక్షుడు బాలు ముదిరాజ్, మండలాధ్యక్షుడు మనోహర్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు సోహేల్, అస్లామ్, శ్రీకాంత్, ప్రసాద్, సాయినాథ్, మహమూద్, మతీన్, అఫ్రోజ్, అలీ, అస్తర్ పాల్గొన్నారు.

### కేసు నమోదు చేయాలి

అయిజ, నవంబర్ 9 : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై నల్ల గొండ సభలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలు చట్ట విరుద్ధమని, వెంటనే సీఎంపై కేసు నమోదు చేయాలని బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం రేవంత్‌రెడ్డిపై పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సుదీర్ఘ పోరాటం చేసి రాష్ట్రాన్ని సాధించిన వ్యక్తిపై రేవంత్‌రెడ్డి పాలనను గాలికొదిలేసి ఇష్టమొచ్చినట్లు మాట్లాడడాన్ని సహించేది లేదన్నారు. సీఎం సీటుకు విలువ లేకుండా చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో మత్తాలి, మైబు, రాజు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్య